
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.9, కనిష్ఠం 27.1







ప్రచార హోరు

నిజామాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచార హోరు మొదలైంది. శాసనసభ ఎన్నికలకంటే భిన్నంగా ప్రచారాన్ని అభ్యర్థులు నిర్వహిస్తున్నారు. భారీ బహిరంగ సభలకన్న మండల సమావేశాలు, సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ క్యాడర్‌ను పాల్గొనేవిధంగా చేస్తున్నారు. ప్రధాన అంశాలపై దృష్టి పెట్టి ప్రచారానికి దిగుతున్నారు. ధాన్యం కొనుగోలు, పంటల నష్టం, పసుపు బోర్డు, నిజాంషుగర్ ఫ్యాక్టరీలు, బీడీ కార్మికులు, గల్ఫ్ కార్మికులే పార్టీల ప్రధాన ఎజెండాగా చేసుకొని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మూడు పార్టీల నేతలు ఇవే అంశాలను ఆయుధంగా చేసుకొని ముందుకు పోతున్నారు. ప్రతి అంశాన్ని ప్రచారం చేయడంతో పాటు వలసలను ప్రోత్సహిస్తున్నారు. క్యాడర్‌లో ధైర్యాన్ని నింపడంతో పాటు గెలిచే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

- నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మొదలైన ఎన్నికల ప్రచారం
- ప్రధాన అంశాలపై ఫోకస్ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ధాన్యానికి బోనస్, పసుపు, నిజాంషుగర్ ఫ్యాక్టరీలు, గల్ఫ్, బీడీ కార్మికులపై దృష్టి
- మండల స్థాయిలో నేతల సమావేశాలు
- సంఘాలను ఆకట్టుకునే ప్రయత్నాలు

పదేళ్ల తర్వాత కాంగ్రెస్ కన్ను

నిజామాబాద్ పార్లమెంట్‌ను పదేళ్ల తర్వాత తిరిగి గెలిచేందుకు కాంగ్రెస్ పార్టీ నేతలు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రకటించడంతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలును ప్రధాన ఎజెండాగా తీసుకొని ముందుకు వెళ్తున్నారు. ఓటర్ల మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ ఎత్తున వలసలను ప్రోత్సహిస్తూనే పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో మరింత బలోపేతం అయ్యేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిజాం షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించలేదని తమ ప్రభుత్వం పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టిందని ప్రకటిస్తున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో గత నెలలో నిజాంషుగర్ ఫ్యాక్టరీలు బోధన్, ముత్యంపేటలో పరిశీలించారు. రైతులకు హామీలు ఇవ్వడంతో పాటు త్వరలోనే పునరుద్ధరిస్తామని ప్రకటించారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో అందరూ ప్రచారంలో ఉండే విధంగా చూస్తున్నారు.

సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీజేపీ యత్నం

నిజామాబాద్ సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ నిలబెట్టుకునేందుకు బీజేపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ పార్టీ అగ్రనేతలంతా ఈసారి రాష్ట్రంలో మెజార్టీ సీటు సాధించేందుకు నేతలకు దిశానిర్దేశం చేయడంతో పాటు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌నే మళ్లీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన పార్లమెంట్ పరిధిలో కలియ తిరుగుతున్నారు. నెలరోజులుగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు అభ్యర్థులకన్న ముందుగా ప్రచారాన్ని పూర్తిచేశారు. పసుపు బోర్డును ప్రధాన ఆయుధంగా చేసుకొని ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని పసుపు బోర్డును ఏర్పాటు చేసిందని ప్రకటనలు చేస్తూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎగుమతులను ప్రోత్సహించడం వల్లే ఈ సంవత్సరం భారీగా పసుపు ధర పెరిగిందని ప్రకటిస్తున్నారు. పూర్తిస్థాయిలో తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. తనను మరోసారి గెలిపిస్తే జిల్లాలో పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు పరిశ్రమలను తీసుకువస్తానని హామీలు ఇస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి నిజాంషుగర్ ఫ్యాక్టరీలను తెరిపించే విధంగా చూస్తానని హామీలు ఇస్తున్నారు. పూర్తిస్థాయిలో కలియతిరుగుతూ పసుపు బోర్డు ఎజెండాగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. ఇరవై రోజుల క్రితం జగిత్యాలలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ కూడా పసుపు బోర్డు ఏర్పాటు అంశాన్ని ప్రస్తావించడంతో పాటు అనుబంధ రంగాలను కూడా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. పూర్తిస్థాయిలో ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో మరిన్ని పెద్ద సభలు నిర్వహించేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారు. వివిధ సంఘాలతో చర్చలు జరుపుతూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.



అభివృద్ధే అంశంగా బీఆర్ఎస్ ప్రచారం

తమ ప్రభుత్వం పదేళ్ల అభివృద్ధిని చూసి ఈ దఫా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రచారం చేస్తున్నారు. అన్ని వర్గాలతో చర్చలు జరుపుతున్నారు. నియోజకవర్గాల్లో ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు. పార్టీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయడంతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని ప్రకటనలు చేస్తున్నారు. పసుపు, నిజాంషుగర్ ఫ్యాక్టరీలపై బీజేపీ, కాంగ్రెస్ ఇచ్చే ప్రకటనలను రాజకీయంగా లబ్ధికోసమేనని విమర్శిస్తున్నారు. పదేళ్లలో అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా బీఆర్ఎస్ పనిచేసిందని ఈ దఫా అవకాశం ఇస్తే మెరుగైన విధంగా పనిచేస్తామని హామీ ఇస్తున్నారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి జిల్లాలో అన్ని సమావేశాల్లో పాల్గొనడంతో పాటు క్యాడర్ పాల్గొనే విధంగా ప్రయత్నాలను చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రచారానికి దిగడంతో పాటు గెలుపుపై దృష్టిపెట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. నిజామాబాద్ పరిధిలో ఎంపీని గెలిపించుకుంటే ఐదేళ్ల పాటు అండగా ఉంటారని పార్టీ నేతలు భావిస్తూ ఈ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.



ఇందూరు తిరుమలలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కన్నుల పండువగా కల్యాణోత్సవం

మోపాల్, ఏప్రిల్ 2: మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదపండితుల సమక్షంలో కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవనాథ జీయర్ స్వామి మాట్లాడుతూ.. స్వామివారి కల్యాణంలో పాల్గొంటే కన్యాదాన ఫలం వస్తుందని అన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో కల్యాణ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. ప్రతి సంవత్సరం ఈ ఆలయంలో పెద్ద ఎత్తున బ్రహ్మోత్సవాలు నిర్వహించడంతో పాటు పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య గంగోత్రి రామానుజస్వామి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ప్రముఖ నిర్మాత శిరీష్, సినీ హీరో ఆశిష్, నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, యాజ్ఞాచార్యులు శిఖామణి, శ్రీకర్‌కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నీరు లేక వెలవెలబోతున్న ఎస్సారెస్పీ



- పంటలు చేతికి రావడంతో ఆయకట్టుకు నీటి నిలిపివేత
- ఉన్న నీటిని తాగునీటికి వినియోగించుకునేందుకు నిర్ణయం
- ప్రాజెక్టులో ప్రస్తుతం 12.852 టీఎంసీల నీరు

ఎస్సారెస్పీలో తగ్గిన నీటి మట్టం

నిజామాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో పంటలు చేతికి వస్తుండటంతో నీటి విడుదలను నిలిపివేశారు. ఆయకట్టుకు నిర్ణయించిన ప్రకారం డిసెంబరు నుంచి ఏప్రిల్ 2 వరకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో గణనీయంగా నీటిమట్టాలు తగ్గిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతులు మరోతడి కోసం నీటిని విడుదల చేయాలని కోరుతున్నా ప్రాజెక్టులో ఉన్న నీళ్లు తాగునీటికి సరిపోనుండటంతో ఉన్న నీటిని కాపాడేందుకు నిర్ణయించారు. పూర్తిస్థాయిలో తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు డిసెంబరు 16 నుంచి నీటిని విడుదల చేశారు. ఏప్రిల్ 2 న నీటిని నిలిపివేశారు. ప్రాజెక్టు పరిధిలో పంటలు చేతికి వస్తుండటం నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోవడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు పరిధిలో ఆయకట్టు అంతా వరి ఉండటం మెజార్టీ పంట చేతికి రావడంతో ఉన్న నీళ్లను తాగునీటి కోసం వినియోగించేందుకు సిద్ధమవుతున్నారు.

తాగునీరు అందించేందుకు ఏర్పాట్లు

వచ్చే మూడు నెలల పాటు నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల ప్రాంతాలకు నీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. యాసంగి ఆయకట్టుకు నీటిని విడుదల చేసే సమయంలో ప్రాజెక్టులో 78 టీఎంసీలు ఉండగా ప్రస్తుతం 12.852 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు 62 టీఎంసీల నీటిని వినియోగించారు. ప్రస్తుతం 12.852 టీఎంసీలు ఉండగా తాగునీటి కోసం విడుదల చేసేందుకు నిర్ణయించారు. వేసవి ఎండలు పెరగడం తాగునీటి అవసరాలు జూలై వరకు ఉండటంతో ఐదు టీఎంసీల నీటిని అందించేందుకు నిర్ణయించారు. ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ ఐదు టీఎంసీలు ఉండగా ఆవిరి రూపంలో ఒక టీఎంసీ నీళ్లు వృథా కానున్నాయి. మిగిలిన ఒక టీఎంసీ మేర నీటిని సరస్వతీ, లక్ష్మి కాల్వలతో పాటు ఇతర కాల్వల పరిధిలో ఒక తడికి నీటిని ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. తాగునీటికి ఇబ్బంది రాకుండా నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లా పరిధిలో నాలుగు నెలల పాటు తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు నిర్ణయించారు. ఎండలు ఒకేసారి పెరగడం గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల నీటి వినియోగం పెరిగింది. తాగునీటి అవసరాల కోసం ఉన్న నీటిని వినియోగిస్తామని ఎస్సారెస్పీ ఈఈ చక్రపాణి తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

హామీలను నెరవేర్చని బీజేపీ, బీఆర్ఎస్

- వచ్చే ఖరీఫ్ నుంచి ధాన్యానికి బోనస్ చెల్లింపులు
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీజేపీ, బీఆర్ఎస్ నేతలు నెరవేర్చలేదని కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతాంగాన్ని ఏనాడూ బీజేపీ నేతలు పట్టించుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు పసుపు బోర్డుపై స్పష్టత ఇవ్వలేదన్నారు. బోర్డు ప్రకటించి ఆరు నెలలు అవుతున్నా.. ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో కూడా చెప్పలేదన్నారు. పసుపునకు 15వేల మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నా.. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మద్దతు ధరను నిర్ణయించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. వచ్చే ఖరీఫ్ నుంచి ధాన్యం కొనుగోలుపై 500 రూపాయల బోనస్‌ను ఇస్తామన్నారు. కొత్త బడ్జెట్ అమలు నుంచి తాము వరికి బోనస్ ఇస్తామని ప్రకటించామన్నారు. వచ్చే ఖరీఫ్‌లో కొత్త పంట వస్తుందని, అప్పటి నుంచి అమలు చేస్తామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ఫసల్‌బీమా యోజన అమలు చేయకపోవడం వల్లనే రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు ఎవరికి ఉద్యోగాల కల్పన చేపట్టలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసింది బీజేపీ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. రాష్ట్రంలోని చక్కెర కర్మాగారాలను ప్రైవేటుపరం చేసింది టీడీపీ, బీజేపీ హయాంలోనేనని జీవన్‌రెడ్డి ఆరోపించారు. కవిత హయాంలో ఉన్న ఫ్యాక్టరీలు మూతపడ్డాయన్నారు. చక్కెర కర్మాగారాల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ వేసి నిజాం చక్కెర కర్మాగారాలను పరిశీలించామన్నారు. వాటిని తెరిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్, జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ నగర అధ్యక్షుడు కేశవేణు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణురాజ్, శేఖర్ గౌడ్, అంతిరెడ్డి రాజరెడ్డి, ఆవేజ్, ఇతర నేతలు పాల్గొన్నారు.



రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.34	ఉ. 4.46

ఎవడు ఒక సత్కార్యం చేస్తాడో అతడికి దానికి పదిరెట్ల ప్రతిఫలం అందుతుంది.

పోలింగ్ విధులపై అవగాహన కలిగి ఉండాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మే 13న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా శిక్షణ తరగతుల్లోని మాస్టర్ ట్రైనర్లచే నివృత్తి చేసుకోవాలన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫెలిసిటేషన్ సెంటర్లు, పీవోలు, ఏపీవోలకు అందిస్తున్న హ్యాండ్‌బుక్, శిక్షణ ఇస్తున్న తీరును పరిశీలించారు. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ విధులు నిర్వహించిన సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదుర్కొన్న సమస్యల గురించి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో, ఏపీవోలకు కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకొని ఎన్నికల విధులకు సంబంధించి అన్ని అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహనను ఏర్పర్చుకోవాలని ఇదివరకు ఎన్నికల విధులు నిర్వర్తించిన వారు సైతం ట్రైనింగ్ క్లాసులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల గురించి తెలుసుకోవాలని సూచించారు. పోలింగ్ డే సందర్భంగా పీవోలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించవల్సిన బాధ్యత గురించి వివరించారు. ఎక్కడ కూడా పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. అతివిశ్వాసంతో తప్పులు చేస్తారని డిస్ట్రిబ్యూషన్ రోజు ఈవీఎంలు తీసుకొని పోలింగ్ డే పూర్తయిన తర్వాత సాయంత్రం కాగానే తిరిగి ఇవ్వవల్సిన బాధ్యత పీవోలదేనన్నారు. పొలిటికల్ ఏజెంట్లు మిమ్మల్ని ప్రశ్నించే అవకాశం ఉంటుందని దానికి సమాధానం చెప్పాల్సింది పీవోనే అన్నారు. పోలింగ్ రోజు పీవోలే బాస్ అని ఎవరికి బాధ్యత ఉండదని ఆయన అన్నారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రైతులకు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలి

- పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి
- కలెక్టర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి, బిగాల

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: రైతులకు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున రూరల్ మాజీ ఎమ్మెల్యే, నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త తదితరులు మంగళవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడం జరిగిందని కానీ దానిపై ప్రభుత్వం ప్రకటన చేయలేదన్నారు. చేతికి వచ్చే దశలో పంటలు నష్టపోవడం రైతాంగానికి ఆందోళన కలిగిస్తుందని వెంటనే ప్రభుత్వం గ్రామాల వారీగా పంటనష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. యాసంగి ధాన్యం కొనుగోలు ప్రారంభమైనా ప్రభుత్వం బోనస్ ప్రకటన చేయడం లేదని ఇప్పటికే సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని బోనస్‌తోనైనా రైతులకు లాభం జరుగుతుందన్నారు. మార్పు రావాలని ప్రజలు ఎలాగైతే కోరుకున్నారో మళ్లీ మార్పు రావాలని అదే ప్రజలు కోరుకుంటున్నారని మళ్లీ సీఎంగా కేసీఆర్‌ను చూడాలనుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే బోనస్ ప్రకటించాలని, మిగిలిన రైతుబంధు డబ్బులు వెంటనే వేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్ నీతూకిరణ్, నాయకులు సిర్పరాజు, సుజిత్‌సింగ్, సత్యప్రకాశ్, రవిచందర్, జడ్పీటీసీ సుమన తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాజిరెడ్డి, బిగాల తదితరులు

రాజంపేటలో విద్యార్థులకు వైద్య పరీక్షలు

రాజంపేట, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆర్‌బీఎస్‌కే రాష్ట్రీయ బాల స్వస్థ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు వైద్యుడు హరీష్‌గౌడ్ తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలు రాకుండా పలు సూచనలు చేశామని తెలిపారు. ఇందులో డాక్టర్ దివ్యభారతి, నీరజ, ప్రధానోపాధ్యాయులు విజయ నిర్మల, ఆశవర్కర్ షామీమ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నవీపేట,ఏప్రిల్2: మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం బీజేపీ బోధన్ నియోజకవర్గం మహిళ మోర్చా ఇన్‌చార్జి సరిత ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. మండలంలోని నాళేశ్వర్, తుంగిని, నిజాంపూర్, లింగాపూర్, బినోల గ్రామాలలో ఉపాధి హామీ కూలీలు, మహిళ సంఘాల సభ్యులకు ఈ అవగాహన కల్పించారు. రాబోయే ఎన్నికలలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి మద్దతు పలకాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, ఎంపీటీసీ రాధ, తదితరులున్నారు.

మోర్తాడ్‌లో వీడీసీ అధ్యక్షుడిగా జక్కం అశోక్

మోర్తాడ్, ఏప్రిల్2: మోర్తాడ్ గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా జక్కం అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రతీ ఏడాది ఉగాది పర్వదినాన ప్రతి ష్ఠాత్మకంగా జరిగే వీడీసీ అధ్యక్ష పదవికి మంగళవారం కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా జక్కం అశోక్, ఉపాధ్యక్షుడిగా నూ తుల రాజేందర్, కోశాధికారి దడివే అశోక్, కార్యదర్శి పుప్పాల రాజ్ వి ఠల్, ఉపకార్యదర్శిగా కడపటి రాజేశ్వర్, చెక్‌పవర్ జక్కం పృధ్వీరాజ్, సలహా దారుడిగా దొమ్మటి హరీష్‌గౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆల య పూజరి ప్రవీన్ చారి నూతన అధ్యక్షుడు, కమిటీ సభ్యులకు శాలువ వేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల సభ్యులు, పెద్దమను షులు, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ మొనయ్య సేవలు మరువలేనివి

రెంజల్,ఏప్రిల్2: కమ్యూనిజం ద్వారానే పేద ప్రజల బతుకులు మారుతాయని నమ్మిన కామ్రేడ్ వన్నెల మొనయ్య సేవలు మరువలేనివని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్ అన్నారు. సోమవారం కామ్రేడ్ మొనయ్య అనారోగ్యంతో స్వగ్రామం తాడ్‌బిలోలిలో మృతి చెందడంతో మంగళవారం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్న సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్, బి.మల్లేష్, ఒడ్డెన్న నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేద ప్రజల బతుకులు మారాలంటే కమ్యూనిజం ద్వారానే మారుతాయని నమ్మిన కామ్రేడ్ మొనయ్య పార్టీ సిద్ధాంతాలు నమ్ముతూ పార్టీలో 40ఏళ్లు ఆయన చేసిన సేవలు మరిచిపోలేమని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు ఎదిగిన తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ప్రజాసేవకే అంకితమయ్యారని వారన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు నసీర్, సాయిలు, నాగన్న, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

ఇందల్వాయి, ఏప్రిల్ 2: ఇందల్వాయి గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘ సభ్యులు 60 కుటుంబాలకు చెందిన సభ్యులు మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్ తెలిపారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్న వీరు కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఘన్‌పూర్‌లో ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘన్‌పూర్ కి చెందిన ప్రవీణ్(46) గత రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యా చేసుకున్నాడని ఎస్సై మహేశ్ తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై తెలిపారు

బోర్డులే ఘనం.. వసతులు శూన్యం

● గ్రామీణ క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం ● కనీస అవసరాలు కరువు ● ఆటవస్తువులు లేని క్రీడామైదానాలు ● నిర్వహణ కొరత



చేతన్‌నగర్‌లో స్వాగత తోరణానికి పరిమితమైన క్రీడా ప్రాంగణం



కింద పడిన క్రీడా పరికరాలు



సుద్దులంలో అలంకరప్రాయంగా మారిన క్రీడా ప్రాంగణం

కోటగిరి,ఏప్రిల్ 2: క్రీడకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం అయ్యాయి. కనీస వసతులు లేకుండా ఉన్నాయి. కొన్ని చోట్ల స్థలాలు దొరకక ఇబ్బందులు ఎదురవ్వగా స్థలం ఉండి క్రీడా మైదానాలు ఏర్పాటు చేసిన చోట నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారింది. ఆటలకు సంబంధించిన సామగ్రి పూర్తిస్థాయిలో సమకూర్చకపోవడంతో క్రీడాకారులు అటు వైపు వెళ్లడం లేదు.

● ప్రారంభ ఆర్భాటమే..

ఉపాధి హామీ కింద ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలను ఆర్భాటంగా ప్రారంభించారు. ఆ తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ప్రాంగణాలు ఎవరికి ఉపయోగం పడడం లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో జిల్లాలో ఆగమేఘాలపై భూములను చదును చేసి ఆటస్థలాల పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర కోర్టులు పెట్టి అవసరమైన సామగ్రిని అందించాలి. కాని అవి ఎక్కడ కనిపించడం లేదు. క్రీడా ప్రాంగణాలు గోతులు, గడ్డి, పిచ్చి మొక్కలు మొలచి దర్శనం ఇస్తున్నాయి.

● నత్త నడకన పనులు

జిల్లా వ్యాప్తంగా 530గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటన్నింటిలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు 20గుంటల వరకు స్థలం కేటాయించాలని సూచించింది. స్వాగత తోరణం, పరికరాలు, ఇతర ఖర్చులకు రూ.50వేలు, చదును చేయడం, ఇతర ఖర్చులకు లక్ష వరకు మంజూరు చేశారు. జిల్లాలో వందలాది పంచాయతీల్లో స్థలాలను గుర్తించారు. కొన్నింటిలో పనులు చేపట్టారు. మరి కొన్ని చోట్ల పనులు ప్రారంభం కాలేదు. ప్రారంభమైనవి నత్త నడకన కొనసాగుతున్నాయి. ఆటల సామగ్రి ఎక్కడ అందుబాటులో ఉంచడం లేదు. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

● కోటగిరి ఉమ్మడి మండలంలో 28గ్రామ పంచాయతీలు ఉండగా 16గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. 12గ్రామాల్లో స్థల సమస్యతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయలేదు. కొన్ని చోట్ల క్రీడా పరికరాలు మూలనపడ్డాయి. మరికొన్ని చోట్ల వాటి ఊసే లేకుండా పోయింది. స్వాగత తోరణాలకే క్రీడా ప్రాంగణాలు పరిమితయ్యాయి.

వినియోగంలోకి తీసుకువస్తాం



కోటగిరి మండలంలో 16క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశాము. మిగిలిన చోట్ల స్థల సమస్యతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం కొన్ని క్రీడా ప్రాంగణాల్లో యువకులు అవసరమైన వాలీబాల్, క్రికెట్, ఖోఖో కిట్లను అందించాము. కొన్నింటిని వినియోగంలోకి తీసుకువచ్చాము. మిగిలిన వాటిని పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతాం.

మనోహర్ రెడ్డి, ఎంపీడీవో, కోటగిరి

ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలి : ఆర్డీవో

బోధన్‌రూరల్,ఏప్రిల్2: ఎన్నికల నియమ, నిబంధనలు తప్పకుండా పాటించి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని బోధన్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్ అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహన కలిగిఉండాలని సూచించారు. పోలింగ్ నిర్వహించే విధానంతో పాటు సంబంధిత శిక్షణలో భాగంగా పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల నియమ, నిబంధనలపై ప్రతి ఒక్కరు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. మాక్ పోలింగ్, ఈవీఎం, వీవీ ప్యాట్, డ్రా బాక్స్‌ల నుండి మాక్ పోల్ స్లిప్పులను తీసివేయడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, ఆర్ఐ వరుణ్‌లతో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల నిబంధనలపై శిక్షణ ఇస్తున్న ఆర్డీవో

ఆర్టీసీ ద్వారా భద్రాచలం సీతారాముల కల్యాణ తలంబ్రాలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 2: తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ నిజామాబాద్ రీజియన్ భద్రాచలం సీతారాముల తలంబ్రాలను నేరుగా ఇంటికి పంపించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ తలంబ్రాలను ఆర్టీసీ కార్గో ద్వారా బుక్ చేసుకున్న భక్తులకు ఇంటి వద్దకే నేరుగా అందించనుంది. ఈ కళ్యాణ తలంబ్రాలకు ప్యాకెట్‌కు కేవలం రూ.151 ఆన్‌లైన్ ద్వారా లేదా సమీపంలో ఉన్న ఆర్టీసీ కార్గో బుకింగ్ ద్వారా చేసుకునే సౌకర్యాన్ని కల్పించింది. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజియన్ మేనేజర్ జానిరెడ్డి తెలిపారు.నిజామాబాద్ డిపో-1 9154298727,డిపో-27396889496, ఆర్మూర్ 9550232626, బోధన్ 9014296638, బాన్సువాడ 9154298729, కామారెడ్డి 9154298730 నెంబర్లను సంప్రదించి బుక్ చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

● పదేళ్లుగా బీజేపీ సర్కార్ 2లక్షల ఉద్యోగాలు ఇవ్వలేదు ● డిచ్‌పల్లిలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఘర్షణ

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ఇచ్చిన 6గ్యారెంటీలను అమలు చేసి ప్రతిపక్షాల నోర్లు మూయించిందని రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి కేఎన్ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి రూరల్ ఎమ్మెల్యే డా.రేకులపల్లి భూపతిరెడ్డి కోరిక మేరకు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడిచిన 3నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేరవేరుస్తు ముందుకు సాగుతోందని నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొ నియోజకవర్గానికి రూ.3వేల ఇళ్లు మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ కష్టకాలంలో చేదోడు వాదోడుగా నిలిచిన కార్యకర్తలకు, నాయకులకు న్యాయం చేస్తామని కార్యకర్తలు, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ వచ్చేల ప్రచారం నిర్వహించాలని కోరారు. పదేళ్లుగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న అర్వింద్ ధర్మపురి చేసిన అభివృద్ధి శూన్యమని పసుపు బోర్డుకు బాండు పేపర్ రాసి ఇచ్చిన అర్వింద్ మాటాలు జిల్లా ప్రజలు విశ్వసించే ప్రసక్తే లేదన్నారు. తాను 6సార్లు జగిత్యాలలో శాసన సభ్యుడిగా గెలుపొందడంతో ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తనను గుర్తించి టికెట్ ఇచ్చిందని రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ నాయకులను ఓడించాలని, కాంగ్రెస్ గెలుపుకోసం కృషి చేయలన్నారు. గతపదేళ్ల కాలంలో కమిషన్ల కోసం కక్కుర్తి పడి రూ.38వేల కోట్లు కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకుతిన్నారని ఆయన ఆరోపించారు. గల్ఫ్ కుటుంబాలు, బీడీ కార్మికుల కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని, బీడీ కార్మికులకు ఏలాంటి ఆక్షంలు లేకుండా పెన్షన్ సౌకర్యం కల్పిస్తామ న్నారు. బీజేపీ మోదీ ప్రభుత్వం గడిచి న పదేళ్లుగా ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తుందని 2014 లో 400 రూ. ఉన్న గ్యాస్ సిలిండర్ 2024 లో రూ.1200 లకు కేంద్రం పెంచిందన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తే రైతులు సోమరిపోతులు అవుతారని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అంటుందని,కానీ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే లక్ష రూపాయల రుణమాఫీ చేస్తుందని తెలిపారు. మూత పడిచిన చక్కర ఫ్యాక్టరీలను తాము తెరిపిస్తామని రాష్ట్ర ప్రభుత్వం కమిటీ కూడా వేసిందన్నారు.



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

ఈ నెల 6న హైదరాబాద్‌లోని తుక్కు గూడలో జరిగే కాంగ్రెస్ బహిరంగ సభ ను కార్యకర్తలు విజయవంతం చేయలన్నారు.

● ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కార్యకర్తలు గొడవ

డిచ్‌పల్లిలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సాక్షిగా కాంగ్రెస్ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. మంగళవారం జిల్లాలోని డిచ్‌పల్లిలో గల కేఎన్ఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లోని నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి గొడవకు దిగారు. తాము 20ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి పని చేశామని.. అయితే బీఆర్ఎస్‌లో పనిచేసి కాంగ్రెస్‌లోకి చేర్చుకున్న ధర్మారం గ్రామానికి చెందిన సాయి ప్రసాద్‌ను స్టేజీ పైకి పిలవడాన్ని పలువురు నాయకులు అడ్డుకున్నారు. దీంతో రెండు కాంగ్రెస్‌లోని రెండు వర్గాల కార్యకర్తలు ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడ్డారు. దీంతో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి జోక్యం ఇరు వర్గాల కార్యకర్తలను సముదాయించడంతో.. వివాదం సద్దుమణిగింది.ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కాటిపల్లి నగేశ్‌రెడ్డి, పార్టీ ప్రతినిధులు అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, కంచెట్టి గంగా ధర్, గడీల రాములు,న్యాస రాజేశ్వర్, డాక్టర్ షాదుల్ల, ముల్లంగి నర్సయ్య, రాంచందర్‌గౌడ్, పులి వెంకటేశ్వరరావు, రాధక్రిష్ణ, వాసుబాబు, మోహన్‌రెడ్డి, గోపాలం విద్యాసాగర్ రావు, శేఖర్ గౌడ్, కేశ వేణు, పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

హనుమాన్ మాలధారణ చాలా పవిత్రమైనది



హనుమాన్ మందిరంలో పూజలు చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్2: హనుమాన్ మాలధారణ చాలా పవిత్రమైనదని వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ అన్నారు. నిత్యం హనుమాన్ చాలీసా పటిస్తే కోరిన కోర్కెలు నెరవేరి సకల శుభాలు కలుగుతాయన్నారు. 21రోజుల మాలధారణ వేసుకునే కార్యక్రమం పూర్తయిందన్నారు. హనుమాన్ స్వాములు నిత్యం నిష్ఠగా ఉంటూ హనుమాన్ చాలీసా పటిస్తూ లోక కల్యాణం కోసం ప్రత్యేక పూజలు చేపట్టాలన్నారు. హిందువులు ప్రతిరోజు హనుమాన్ మందిరం ఆలయ ప్రదక్షిణ చేయాలని దీని వల్ల అరిష్టాలు తొలగి సకల శుభాలు కలుగుతాయన్నారు. గురుస్వామి దొడ్ల రవీందర్ రెడ్డి సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ స్వామి, ప్రవీణ్ రెడ్డి స్వామి, ఆదిత్య స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ శవం చెరువులో లభ్యం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 2: మండలంలోని ఘన్‌పూర్ రాజరాజేశ్వర చెరువులో మంగళవారం మధ్యాహ్నం 40-45 ఏళ్ల వయస్సు గల గుర్తు తెలియని మహిళ శవం గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారని ఎస్సై మహేశ్ ప్రకటనలో తెలిపారు.గ్రామస్థుల పిర్యాదు మేరకు శవా న్ని పంచనామా చేసి పోస్ట్ మార్టం కోసం జిల్లా ఆస్పత్రికి శవాన్ని తర లించ మన్నారు.శవాన్ని గుర్తించలంటే డిచ్‌పల్లి పోలీసులను సంప్రదిం చాల న్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ పనుల పరిశీలన

మోపాల్, ఏప్రిల్ 2: గ్రామాల్లో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులను ఎంపీడీవో లింగం మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు నీడవసతి, నీటి వసతి కల్పించాలన్నారు. ప్రతి కూలీకి రూ.150 పడే విధంగా చూడాలని కోరారు. ప్రతి గ్రామంలో ఉపాధి లేదని అనకుండా కూలీలందరికి ఉపాధి హామీ పనులను కల్పించాలన్నారు.

పోలీసు స్టేషన్ నుంచి తప్పించుకున్న ఇద్దరు అనుమానితులు

● గాలిస్తున్న పోలీసులు

ఖిల్లా,ఏప్రిల్ 2 : జిల్లా కేంద్రంలోని ఆరవటౌన్ పోలీసు స్టేషన్ నుంచి ఇద్దరు అనుమానితులు సోమవారం అర్ధరాత్రి తప్పించుకున్నట్లు తెలిసింది. ఒక దొంగతనం కేసులో వీరిని విచారణ చేసేందుకు పోలీసులు తీసుకొచ్చారు. కాగా అర్ధరాత్రి తర్వాత ఇద్దరు పోలీసుల కళ్లుకప్పి పారిపోయారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదుపులో ఉన్న వారిలో ఒకరు మహారాష్ట్ర నాందేడ్‌కు, మరోకరు నగరానికి చెందిన వారుగా పోలీసులు తెలిపారు. వీరిని వెంటనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బోధన్‌రూరల్,ఏప్రిల్2: బెల్లాల్ గ్రామానికి చెందిన వనమాలి శ్యామ్(35)అనే వ్యక్తి సోమవారం అర్ధరాత్రి ఇంట్లో రేకుల రాడ్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టాలన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

కోటగిరి,ఏప్రిల్2: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని పీఆర్‌టీయూ నాయకులు ఇల్తెపు శంకర్ పేర్కొన్నారు. పొతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కొల్లూర్ వెంకట సుబ్బారావు పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పీఆర్‌టీయూ నాయకులు శంకర్ ముఖ్య అతిథిగా హజరైన మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో అంకిత భావంతో పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుందన్నారు. 39ఏళ్లుగా సుబ్బారావు ఎంతో సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగనాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కారు చెట్టుకు ఢీకొని మహిళ మృతి

● మరో నలుగురికి తీవ్ర గాయాలు ● ధర్మాబాద్‌కు కారం కోసం వెళ్లి వస్తుండగా ఘటన ● అతి వేగమే ప్రమాదానికి కారణం

నవీపేట, ఏప్రిల్ 2 : నిజామాబాద్ జిల్లా నవీపేట పోలీసు స్టేషన్ పరిధిలోని జగ్గారావు ఫారం సమీపంలో మంగళవారం కారు అతి వేగంతో చెట్టును ఢీకొన్న ఘటనలో ఒక మహిళ మృతి చెందగా.. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ నగరంలోని కోటగల్లీకి చెందిన కౌమూరి సుదర్శన్ తన కారును అద్దెకు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం సుదర్శన్ తన భార్య సులోచనతో పాటు తమ ఇంటి పక్కన ఉన్న కవిత, శారద, అనిత అనే ముగ్గురు మహిళలతో కలిసి మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు ఎండుకారం పట్టించేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో నవీపేట- జానకంపేట మధ్యన గల జగ్గారావు ఫారం సమీపంలో కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు తీవ్రంగా గాయపడగా బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలో తీవ్రంగా గాయపడిన కౌమూరి సులోచన(52)మృతి చెందింది. సుదర్శన్‌తో పాటు కవిత, శారద, అనితలు సైతం తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా.. ప్రమాదానికి అతి వేగమే కారణమని తెలుస్తోంది. డ్రైవర్ సుదర్శన్ నిర్లక్ష్యంగా కారును నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం. మృతురాలు సులోచన కుమారుడు మనీష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు.



ప్రమాదం జరిగిరిన దృశ్యం

పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు

ఇందల్వాయి, ఏప్రిల్ 2: ఇందల్వాయి మండలంలోని వెంగల్‌పాడ్ గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం పశుసంర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి గంగాప్రసాద్ తెలిపారు. గ్రామంలోని సుమారు 800 ఆవులకు, గెదెలకు ఉచిత టీకాలు వేశామని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ప్రతి పాడిరైతులు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తిరుపతి, రాజు, సుజాత, పోశెట్టి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

తిప్పాపూర్‌లో పీడీఎస్ బియ్యం పట్టివేత

భిక్కనూరు, ఏప్రిల్ 2: భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని భిక్కనూరు పోలీసులు మంగళవారం పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. భిక్కనూరు ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వీరమని శ్రీను బాబు తన ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు దాడి చేసి అక్రంగా నిల్వఉంచిన 18.64క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయ్యడం జరిగిందని ఎస్సై తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని జంగంపల్లి గోదాంకు తరలించామన్నారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రంగా నిల్వ ఉంచిన, సేకరించి రవాణా చేసిన వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో సిబ్బంది పాల్గొన్నారు.

వజ్జెపల్లి గ్రామ అభివృద్ధికి కృషిచేయాలి

సదాశివనగర్,ఏప్రిల్ 2:మండలంలోని వజ్జపల్లి గ్రామ అభివృద్ధికి కృషిచేయాలని వజ్జపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు విన్నవించకారు. మంగళవారం మండలంలోని భూంపల్లిలో బాధితకుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రతీ కార్యకర్తను తాను మర్చిపోకుండా కాపాడుకుంటానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు.అనంతరం వజ్జెపల్లి గ్రామస్థులు గ్రామసమస్యలను ఎమ్మెల్యేదృష్టికి తీసుకురాగా తప్పకుండా కృషిచేస్తానని తెలిపారు.

పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్2: నిజాంసాగర్‌కాలువకు గండి పడడం వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొని గత 25ఏళ్లుగా నివాసముంటున్న వీరందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్మూర్ పట్టణంలోని 18వార్డులో నిజాం సాగర్ కాలువ తెగిపోయి నష్టపోయిన కుటుంబాలను రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్నలు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో నిజాంసాగర్ కాలువకు గండిపడి తెల్లవారుజామున నీరు రావడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. ఇళ్లల్లోకి నీటితో పాటు మట్టి కొట్టుకురావడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నార న్నారు. కాలువకు గండిపడి తెగిపోవడానికి ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యమేనని వారు విమర్శించారు. ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి బి.కిషన్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఆకులగంగారాం, శేఖర్, పీవోడబ్ల్యు లక్ష్మీ, అర్వింద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో భారీగా పట్టుబడుతున్న నగదు

ఖిల్లా, ఏప్రిల్ 2 :పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఇప్పటి నుంచే వాహనాల తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ ఆదేశాల మేరకు పలు చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే నగరంలో భారీగా నగదు పట్టుకుంటున్నారు. గత వారం రోజుల క్రితం నగరంలోని రెండవ టౌన్ పరిధిలో రూ.8లక్షల నగదును పట్టుకున్న పోలీసులు రెండు రోజులుగా నగరంలోని ఒకటోటౌన్ పరిధిలో భారీగ నగదును పట్టుకుంటున్నారు. ఆదివారం రాత్రి 4లక్షల రూపాయలను నగరంలోని కుమార్‌గల్లీ ప్రాంతంలో పట్టుకున్న పోలీసులు సోమవారం రాత్రి సుమారు రూ.34లక్షల నగదును, 400గ్రాముల బంగారంను పట్టుకున్నారు. ఆ వ్యక్తి వద్ద వాటికి సంబంధించిన ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని తదుపరి విచారణకు సంబంధిత శాఖాధికారులకు అప్పగించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లకు ప్రలోభాలు కలిగించకుండా ఉండి ఎన్నికలు సజావుగా జరిగేందుకు పోలీసు శాఖ ఇప్పటి నుంచే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. దీంతో ఏది ఎన్నికల డబ్బు ఏది సాధరణ వ్యక్తుల డబ్బు అని గుర్తించలేక పోతున్నారు. పోలీసులు మాత్రం రూ.50వేలకు పైగా నగదు దొరుకగానే వాటిని స్వాధీనం చేసుకుని ఆధారాలు లేనివాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. దీని వల్ల సామాన్య ప్రజలు రూ.50వేలకు పైగా డబ్బును తరలించేందుకు భయపడుతున్నారు.



సైబర్ క్రైమ్ కేసు నమోదు చేస్తున్న పోలీసులు

సైబర్ క్రైమ్ స్టేషన్‌లో మొదలైన కేసుల నమోదు

ఖిల్లా,ఏప్రిల్ 2: సైబర్ క్రైమ్ వల్ల లక్ష రూపాయలకు పైగా నష్టపోయిన వ్యక్తి నుంచి ఫిర్యాదు తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇలాంటి కేసు రావడంతో మంగళవారం సైబర్‌క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసును నమోదు చేశారు. సైబర్ క్రైమ్ వలలో ఎవరూ పడొద్దని పోలీసులు తెలిపారు. ఎవరైనా సైబర్ క్రైమ్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటే కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు కోరారు.

వ్యక్తి మృతికి కారకులైన 8మంది అరెస్టు

నవీపేట,ఏప్రిల్2: గత నెల 30న నిజామాబాద్ మండలం పాల్దాలో దొంగతనానికి వచ్చి పారిపోతున్న బానోత్ సునీల్‌పై దాడి చేసి అతడి మృతికి కారకులైన పలువురు పాల్దా గ్రామస్థులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీష్ కుమార్ తెలిపారు. గ్రామ శివారులో మూతబడిఉన్న ఓ రైస్ మిల్లులో పాత సామానును ఎత్తుకెళ్లడానికి ఆరుగురు వ్యక్తులు రైస్‌మిల్లులో చొరబడగా ఈ విషయాన్ని గమనించిన గ్రామస్థులు వారిని వెంబడించడంతో ఇందులో ఐదుగురు నిందితులు పరారీ కాగా మరో నిందితుడు బానోత్ సునీల్‌ను గ్రామస్థులు పట్టుకుని కర్రలు, చేతులతో దాడి చేయడంతో అతడు చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ వివరించారు. ఈ దాడిలో పాల్గొన్న పాల్దాకు చెందిన మగ్గిడి దేవన్న, బైకన్ నరేష్, గోనె సదానంద్, మొగులాజి అశోక్, ఉల్లంగ శేఖర్, మొగులాజి ప్రభాకర్, మొగులాజి సందీప్, క్యాతం కిషోర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని సీఐ వివరించారు. ఈ దాడిలో పాల్గొన్న మరికొంత మంది పరారీలో ఉన్నారని త్వరలో వారిని కూడా పట్టుకుని అరెస్టు చేయడం జరుగుతుందని సీఐ పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరి మృతి

ఎడపల్లి, ఏప్రిల్ 2: ఎడపల్లి మండలంలోని రాణాకలాన్ గ్రామంలో మంగళవారం సాయంత్రం చెవుల శ్రీకాంత్ (25) అనే వ్యక్తి అంత్యక్రియలకు వెళ్లి ఇంటికి తిరగి వచ్చే క్రమంలో స్నానానికని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి వెల్లగా ప్రమాదవ శాత్తు పడి మృతి చెందినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు లిఖిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లాలో 6లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నదే లక్ష్యం : అడిషనల్ కలెక్టర్

నవీపేట,ఏప్రిల్2: మండలంలోని జన్నేపల్లిలో మంగళవారం అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బినోల సొసైటీ ఆధ్వర్యంలో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ యాసంగి పంటకు సంబంధించి జిల్లాలో 6లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని అన్నారు. దీనికి సంబంధించి జిల్లాలో 466ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఇప్పటికే 140వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, మిగిలిన వాటిని మరో రెండు, మూడు రోజుల్లో ప్రారంభించడం జరుగుతుందన్నారు.రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఏవో పాపయ్య, క్లస్టర్ ఆఫీసర్ జియవుద్దీన్, సొసైటీ కార్యదర్శి రమేష్,సంజీవరావు, గంగాధర్,సాయిలు తదితరులున్నారు.

ఎడపల్లి: రబీ సీజన్‌లో రైతులు సాగుచేసి పండించిన వరి ధాన్యాన్ని విక్రయించేందుకు సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చి మద్దతు ధరను పొందాలని ఎడపల్లి సహకార సంఘం అధ్యక్షులు పోల మల్కారెడ్డి అన్నారు. మంగళవారం ఎడపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రాణాకలాన్, కుర్నాపల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సహకార సంఘం కార్యదర్శి రాజారాం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన చైర్మన్ మల్కారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి 2203, బి గ్రేడ్ రకానికి 2183 రూపాయల మద్దతు ధరను అందిస్తుందని, ప్రతి రైతు కొనుగోలు కేంద్రాల ద్వారా తాము పండించిన వరి ధాన్యాన్ని అమ్మి లాభ పడాలని ఆయన కోరారు. మండలంలో రూర్బన్ పథకం ద్వారా నిర్మించిన మూడు గోదాంలను జిల్లా కలెక్టర్ ఎడపల్లి సహకార సంఘానికి అప్పగించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రుద్రూరు: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం రుద్రూరు మండల కేంద్రంతో పాటు అంబం (ఆర్), అక్బర్‌నగర్, తగిలేపల్లి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం క్వింటాల్ ఏ గ్రేడ్‌కు రూ. 2203, బి గ్రేడ్‌కు రూ.2183 మద్దతు ధర అందిస్తుందన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో విండో సీఈవో లక్ష్మణ్, క్లస్టర్ ఆఫీసర్ రియా జుద్దీన్, ఏఈవో శ్రావణి, గంగారాం, శానం సాయిలు, గంగాధర్, హన్మాండ్లు, శ్రీనివాస్, పండరి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్ని: వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రుద్రూరు వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారిణి శ్రావణి ప్రారంభించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు తొంట శంకర్, కార్యదర్శి లక్ష్మణ్, డైరెక్టర్ గంగారాం, చింతం సాయిలు, శానం శ్రీకాంత్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి గ్రామంలో ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని విండో డైరెక్టర్ కుమ్మరి గంగారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం దళారులకు విక్రయించకుండా కొనుగోలు కేంద్రంలో విక్రయించి లబ్ధి పొందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు రూప సతీశ్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: రైతులు తమ ఆరుగాలం కష్టపడించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని దళారులకు విక్రయించి మోసపోవద్దని జిల్లా పౌరసరఫరాల శాఖ క్లస్టర్ అధికారి రవీందర్ అన్నారు. మంగళవారం సాలూర మండల కేంద్రంలో సహకార సంఘంలో సొసైటీ కార్యదర్శి బస్వంత్ రావు ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని పేర్కొన్నారు. ప్రభుత్వ మద్దతు ధర వరి ధాన్యానికి క్వింటాలు ఏ గ్రేడ్ 2203రూపాయలు, బి గ్రేడ్ ధాన్యానికి 2183 రూపాయలు చెల్లిస్తుందన్నారు. రైతులు దళారులకు విక్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులు తదితరులు న్నారు.

● హున్స సొసైటీ ఆధ్వర్యంలో..

సాలూర మండల కేంద్రంలోని హున్స సహకార సంఘంలో మంగళవారం సంఘ సభ్యులు హన్మంత్ రావు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ కొనుగోలు కేంద్రాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకుని లాభాలు ఆర్జించాలని ఏపీఎం చిన్నయ్య అన్నారు. మంగళవారం మండలంలోని దండిగుట్ట, బాగేపల్లి, నీలా గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సీసీలు భాస్కర్, శ్యామల, కృష్ణ, రాజయ్య, శివ కుమార్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, గౌతమి, రాణి, రైతులు తదితరులున్నారు.

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రామ ప్రత్యేక అధికారులు ప్రారంభించారు. మండలంలోని అర్గుల్, మునిపల్లి, బ్రహ్మణ్‌పల్లి, కొలిప్యాక్ గ్రామాలలో గల సింగిల్‌విండో పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రామ ప్రత్యేక అధికారులు ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చే రైతులకు ఏలాంటి సౌకర్యలు కల్పించకపోవడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదీలా ఉండగా ధాన్యాన్ని తీసుకువచ్చి రోడ్లపై, కల్లాలో ఆరబెట్టి నప్పటికీ న్యాచర్ వచ్చినప్పటికీ ధాన్యాన్ని తూకం వేయడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జక్రాన్‌పల్లి మండలంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.



జన్నేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్



రాణాకలాన్ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



తగిలేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారి



సుద్దపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్

కాంగ్రెస్ రైతు ప్రభుత్వం కాదు

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్, ఏప్రిల్ 2:కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం కాదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. మంగళవారం మోపాల్ గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణించిన తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో లేదని అన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసి అధికారంలోకి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 115 రోజులు అవుతున్నా ఇచ్చిన హామీలో ఒకటి ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏఒక్క టి అమలు చేయలేకపోయారన్నారు.రైతులకు ఇచ్చిన హామీలు కూడా ఏఒక్కటి కూడా అమలు చేయలేకపోయారని అన్నారు. మోదీ, రేవంత్‌రెడ్డిలు ఒక్కటేనని తెలంగాణరాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు ఎవరూ గెలవకుండా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే రైతులకు, అన్ని వర్గాల వారికి సమన్యాయం జరిగిందని అన్నారు. రైతులు పంట వేయకముందే రైతాంగానికి కేసీఆర్ రైతుబంధు వేశారని అన్నారు. ఇప్పుడు రైతులు పంటలు వేసి కోతలకు వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధును వేయలేకపోతున్నారని అన్నారు.గ్రామాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అనేకమంది రైతులు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని అన్నారు. తెలంగాణలో ఉన్నరైతాంగానికి తాగు నీరు అందించాలన్న ఆశయంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారన్నారు. ఈ ప్రాజెక్టుకు 85 పిల్లర్లు ఉంటే 3 పిల్లర్లు కుంగిపోతే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారని మొన్న జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓడిపోయారని మళ్లీ అతనికే కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా కట్టబెట్టిందన్నారు. ప్రస్తుతం ఎంపీగా ఉన్న అర్వింద్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఏఒక్కటి నెరవేర్చలేదని తెలిపారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, పార్టీ అధ్యక్షులు మోచ్చ శ్రీనివాస్, నాయకులు బాజిరెడ్డి జగన్, శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్‌రావు, గోపి, ఉమాపతిరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మానాలను కలిసిన అమీర్‌నగర్ కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి,ఏప్రిల్ 2: ఇటీవలే రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ చైర్మన్ గా బాధ్యతలు శ్వీకరించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డిని కమ్మర్‌పల్లి మండంలోని అమీర్‌నగర్ గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కలిసి బోకె అందించి అభినందనలు తెలిపారు. గ్రాశాఖ అధ్యక్షులు రాజుల రమేష్, మండల పార్టీ కార్యదర్శి నర్సయ్య, లింబాద్రి, లక్ష్మీనర్సయ్య, రాజేశ్వర్, చిన్న నర్స య్య, భూమయ్య, పెద్ద నర్సయ్య, మానాల మోహన్ రెడ్డిని కలిసిన వారి లో ఉన్నారు.

పశువుల నిర్వహణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా సశుసందర్థక శాఖ అధికారి డా. జగన్నాధచారి

ఎడపల్లి, ఏప్రిల్ 2: ఎడపల్లి మండలంలోని ఎమ్మెస్సీ ఫారం గ్రామంలో మంగళవారం పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి, సహాయ సంచాలకులు బాలిక్ అహ్మద్‌లు అకస్మికంగా సందర్శించారు. ఇప్పటి వరకు మండలంలో ఎన్ని తెలుపు, నలుపు రంగు పశువులకు టీకాలు వేశారో మండల పశు వైద్యాధికారి సందీప్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు వేసవిలో ప శువుల పోషణలో తీసుకోవాల్సి జాగ్రత్తలను పాడి రైతులకు వివరించారు. వేసవిలో పశువులు ఆరో గ్యంగా ఉండాలంటే పశువులకు పచ్చిమేతతో పాటు సమయానికి తాగటానికి మంచి నీరు అందించి పశువులు ఎండలో ఉండకుండా నీడలో ఉండేలా చూడాలన్నారు. మేత కోరకు పశువులను ఉదయం, సాయం త్రం బయటకు పంపాలని రైతులకు సూచించారు. ఈసందర్భంగా గ్రామం లో 215 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం జరిగిందని మండల పశువైద్యాధికారి సం దీప్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్య సిబ్బంది కల్యాణి, శ్రీనివాస్, మంజు, ఖాసిఫ్, గోపాలమిత్ర మారుతి తదితరులు ఉన్నారు.



ఎమ్మెస్సీ ఫారంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

దొంగతనానికి యత్నించి పరారీ అయిన ఐదుగురు నిందితుల అరెస్టు

నవీపేట,ఏప్రిల్2: నిజామాబాద్ మండలం పాల్దాలో గత నెల 30న దొంగతనానికి యత్నించి పరారీ అయిన ఐదుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ఆరుగురు వ్యక్తులు పాల్దా గ్రామ శివారులో మూతబడి ఉన్న ఓ రైస్‌మిల్లులో పాత సామాను దొంగలించడానికి రాగా స్థానికులు గమనించి నిందితుల వెంట పడగా అందులో ఒకరైన బానోత్ సునీల్‌పై గ్రామస్థులు దాడి చేయగా అతడు చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనలో మిగిలిన ఐదుగురు నిందితులు పరారీ కాగా మంగళవారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బానోత్ సునీల్‌పై దాడి చేసిన పలువురు గ్రామస్థులపై ఈ పాటికే కేసు నమోదు చేయడం జరుగుతుందని ఎస్ఐ పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఐఈవో

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌లను మర్యాధపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనతో పాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి రజియుద్దీన్, తదితరులు ఉన్నారు.

నగరంలో ఆటీజం డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కేశవులు

పెద్దబజార్, ఏప్రిల్ 2: ప్రపంచ ఆటీజం అవగాహన దినోత్సవం సందర్భంగా డాక్టర్ కేశవులు ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవులు మాట్లాడుతూ.. ఆటీజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అనేది బాల్యంలో ప్రారంభమయ్యే సంక్లిష్టమైన న్యూరో బిహేవియర్ వ్యాధి అని తెలిపారు. ఇది పరిస్థితులకు అనుగుణంగా ఒక వ్యక్తి జీవితాంతం కొనసాగవచ్చన్నారు. సామాజిక పరస్పర చర్య ఆలస్యమైనా.. కఠినమైన ప్రవర్తన వల్ల తీవ్రత పెరుగుతుందని తెలిపారు. ఈ వ్యాధి ఉన్నవారు ఇతరులతో సక్రమంగా మాట్లాడకపోవడం వంటి లక్షణాలు కలిగి ఉంటుందన్నారు. తల్లిదండ్రులు చిన్నవయస్సులో గుర్తించకపోవడం వల్ల చికిత్స ఆలస్యమవుతుందని తెలిపారు. మొదట చికిత్స ప్రారంభిస్తే తొందరగా తగ్గుతుందని ఆయన అన్నారు. ఈ వ్యాధి ఉన్న పిల్లల్ని ఇతర పిల్లలతో కలిసే విధంగా చూస్తే త్వరగా తగ్గుతుందని కేశవులు వివరించారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం

రెంజల్,ఏప్రిల్2: మండలంలోని కందకుర్తి, సాటాపూర్ గ్రామాలలో మంగళవారం వీఎస్టీ కంపెనీ ఆధ్వర్యంలో పొగాకు కొనుగోలు కేంద్రాలను కంపెనీ వైస్ చైర్మన్ అజయ్, ఏరియా మేనేజర్ కృష్ణారావు, నీలా సొసైటీ చైర్మన్ ఇమామ్ బేగ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వీఎస్టీ కంపెనీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతిఏటా మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, ఈ కొనుగోలు కేంద్రాల ద్వారానే పొగాకును కొనుగోలు చేస్తుందన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.235	రూ. 275

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.69,700	రూ.64,200	రూ.795

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : టిల్లు స్క్వేర్ (10.10, 1.10, 7.50, 10.50)
: ఓం భీమ్ భుష్ (4.40)

స్ర్కీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (తెలుగు) (12.00, 2.40)
: గాడ్జిల్లా అండ్ కాంగ్ (3డీ) (ఇంగ్లీష్) (5.20, 8.00, 10.40)

స్ర్కీన్-3 : ది గోట్ లైఫ్ (12.05, 7.00)
: రజాకర్ (3.45)
: ఓం భీమ్ భుష్ (10.40)

స్ర్కీన్-4 : క్రూ (హిందీ) (10.45, 1.35, 7.40, 10.30)
: ప్రేమలు (4.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : టిల్లు స్క్వేర్ (10.45, 1.40, 4.35, 7.30, 10.25)

స్ర్కీన్-2 : గాడ్జిల్లా అండ్ కాంగ్ (10.45, 1.50, 4.30, 7.30, 10.30)

స్ర్కీన్-3 : ది గోట్ లైఫ్ (1.15, 7.30)
: కలియుగ పట్టణంలో (4.30)
: ఓం భీమ్ భుష్ (7.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితమహల్ : ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15 9.15)

నటరాజ్ : గాడ్జిల్లా అండ్ కాంగ్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్